క్లుప్తంగా

ఆది గురుస్వామికి సత్కారం


ప్రముఖ గాయకుడు ఆది గురుస్వామిని సత్కరిస్తున్న రంగస్థలి ప్రతినిధులు


తిరుపతి కల్చరల్: ఘంటసాల అభిమాని, ప్రముఖ గాయకుడు ఆది గురుస్వామిని రాయలసీమ రంగస్థలి ప్రతినిధులు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. నెలవారి కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం చేసి సంగీత సేవకులను సత్కరించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా బుధవారం వీవీ మహల్ రోడ్డులోని ఘంటసాల విగ్రహానికి రంగస్థలి కళాకారులు పాలాభిషేకం చేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం గాయకున్ని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కళాకారులు ఉదయ భాస్కర్‌రెడ్డి, తిరుమలయ్య, సుబ్రమణ్యంరెడ్డి, సురేష్ స్వామి, పద్మనాభం పాల్గొన్నారు.

వినాయక సాగర్ వాకర్స్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న వినాయకసాగర్ వాకర్స్ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్‌కు ఉత్తమ వాకర్స్ అసోసియేషన్ అవార్డు లభించింది. 2024లో అనేక వినూత్న సేవా కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు చేయడంతో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఈ అసోసియేషన్‌ను ఉత్తమ వాకర్స్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈమేరకు బుధవారం వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ నేతలు అవార్డును స్వీకరించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నేతలు శివారెడ్డి, రామస్వామి, సాయికృష్ణంరాజు, వెంకటేశ్వర రాజు, నరసింహయ్య, సుబ్రమణ్యం రాజు, శాంతి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


ఎంపీ గురుమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం జమ్మూ కశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంపీ గురుమూర్తి, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, తమిళనాడు మంత్రి ఆర్ గాంధీ, తమిళనాడు ఎంపీ గోపీనాథ్, ఐపీఎస్ అధికారి పరమేశ్వర్ రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

కొత్త ఏడాది.. అన్నీ సవ్యంగా జరగాలని..


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


తిరుపతిలోని కపిలేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తుల సందడి

నూతన సంవత్సరం సందర్భంగా ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలోని పలు ఆలయాలలో భక్తులు సందడి చేశారు. కపిలేశ్వర స్వామి ఆలయంలో పెద్దఎత్తున భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి కొత్త సంవత్సరంలో శుభం కలగాలని స్వామి వారిని మొక్కుకున్నారు. స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. కపిలతీర్థం జలపాతం వద్ద భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. మరోవైపు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కపిలేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కొనుగోలు చేశారు. అలాగే నగరంలోని శ్రీగోవిందరాజస్వామి, శ్రీకోదండరామాలయం, అలిపిరి పాదాల మండపంలోని శ్రీవారి ఆలయం, కొత్తవీధిలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాలతో పాటు ఇస్కాన్ మందిరం, షిరిడీ సాయి ఆలయాలకు భక్తులు పెద్దఎత్తున విచ్చేశారు. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి


స్వామివారి దర్శనానికి క్యూలైన్లో బారులు తీరిన భక్తులు


తిరుపతిలో శ్రీవారి ప్రసాదాలను కొనుగోలు చేస్తున్న భక్తులు

రోగులకు పండ్లు పంపిణీ

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో ఎముకలు, కీళ్ల విభాగంలోని రోగులకు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పండ్లు పంపిణీ చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రుయాలో రోగులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీకి పెట్రోలియం కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మెంబర్ హోదాలో ఆయనను సంస్థ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని రోగులకు ఎంపీ ధైర్యం చెప్పారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించేలా వైద్యులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. రోగులకు పండ్ల పంపిణీ సేవా కార్యక్రమాన్ని చేపట్టిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌ను ఎంపీ ప్రశంసించారు. కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ డివిజనల్ మేనేజర్ రోహిత్ మోహన్, ఇండియన్ ఆయిల్ సిబ్బంది, రుయా హాస్పిటల్ వైద్యాధికారులు పాల్గొన్నారు.


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ గురుమూర్తి

మోహిత్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

చంద్రగిరి : నూతన సంవత్సరం సందర్భంగా వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బుధవారం ఉదయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. పాకాల, చంద్రగిరి, తిరుపతి రూరల్, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావడం విశేషం. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు మోహిత్‌రెడ్డి ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు అల్పాహారం, మధ్యాహ్నం 12 గంటల నుంచి భోజన వసతి కల్పించారు. మోహిత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరికీ ఈ కొత్త సంవత్సరం మంచి జరగాలని ఆకాంక్షించారు.


పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీపీ యశోద


శుభాకాంక్షలను తెలియజేస్తున్న నాయకులు

కిక్కిరిసిన ఆలయాలు


చినిగేపల్లెలో కట్టమీద గంగమ్మ



పూజలు అందుకుంటున్న, వెంకటేశ్వర స్వామి , కొల్లాపురమ్మ

భాకరాపేట : నూతన సంవత్సరం సందర్భంగా చిన్నగొట్టిగల్లు మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం వేకువ జాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాల వద్ద బారులు దీరారు. మండలంలోని చినిగేపల్లెలో కట్టమీద గంగమ్మ , దేవరకొండ శ్రీవెంకటేశ్వరస్వామి, నెమిలిగుండ్ల శ్రీవెంకటేశ్వరస్వామి, శివాలయం, చిన్నగొట్టిగల్లులోని తిరుపతి గంగమ్మ, భక్తాంజనేయ స్వామి, మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి, వాసవీ కన్యకా పరమేశ్వరి , రంగన్నగారిగడ్డలోని కొల్లాపురమ్మ ఆలయం, భాకరాపేట ముత్యాలమ్మ, బండకొండపై వెలసిన సిద్దేశ్వరస్వామి, బోమకొండ గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించ4ఆరు. ఆలయ ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అన్నదానం చేపట్టారు.,

హైందవ శంఖారావం జయప్రదం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ : ఈనెల 5వ తేదీన విజయవాడలోని కేసరపల్లి వద్ద జరగనున్న హైందవ శంఖారావంలో హిందువులు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. బుధవారం నీర్పాకోటలోని ఆంజనేయస్వామి ఆలయంలో వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో నిర్వాహకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 4వ తేదీ సాయంత్రం బుచ్చినాయుడుకండ్రిగ నుంచి బస్సు హైందవ శంఖారావం సభకు బయలుదేరుతుందని చెప్పారు. ఆలయాల పరిరక్షణ కోసమే హైందవ శంఖారావం నిర్వహిస్తున్నామన్నారు. హిందువులు తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కండలేరులో 57.140 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 57.184 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 700 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగకాలువకు 1030, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

సీపీఎం సమైక్యతా పిలుపు

తిరుపతి కల్చరల్: 'మనమంతా భారతీయులం.. హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు అంతా భరతమాత ముద్దుబిడ్డలం.. దేశ సమైక్యత, మతసామరస్యం వెల్లువిరియాలి.. స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, ప్రగతి బాటలో ముందడుగు వేద్దాం .. 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదాం' అంటూ సీపీఎం పంచిపెట్టిన కరపత్రాలకు విశేష స్పందన లభించింది. బుధవారం నగరంలో సీపీఎం నేతలు ఆ కరపత్రాలను పంచుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కరపత్రం అందుకున్న అనేక మంది మేధావులు, సాధారణ ప్రజలు, సీపీఎం కృషిని అభినందించారు. దివ్యారామం, మున్సిపల్ పార్క్, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, జగ్జీవన్‌రావ్ పార్క్, వినాయక సాగర వంటి ప్రాంతాల్లో విస్తృతంగా కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో గేట్ విద్యాసంస్థల అధినేత తమ్మినేని వెంకటేశ్వర్లు, శ్రీసిటీ జీఎం రామచంద్రారెడ్డి, డాక్టర్ నారపరెడ్డి, రమేష్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు సుబ్రమణ్యం, జయచంద్ర, సాయిలక్ష్మి, మాధవ, లక్ష్మి, వేణుగోపాల్, హేమలత, బుజ్జి పాల్గొన్నారు.


సమైక్యతకు పిలుపునిచ్చే కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి రైల్వేస్టేషన్‌లో వసతుల కరువు!


రిజర్వేషన్ కార్యాలయం వద్ద..


అలంకార ప్రాయంగా ఏటీఎంలు

- నిత్యం లక్ష మందికి పైగా ప్రయాణికులు
- 90 రైళ్లకు పైగా రాకపోకలు
- కనీసం తాగునీటి సౌకర్యం లేదు
- మరుగుదొడ్లు లేవు
- ఏటీఎంలు ఉన్నా నగదు ఉండదు

తిరుపతి అర్బన్ : ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నిత్యం లక్షలాది మంది యాత్రికులు వస్తుంటారు. అందులో తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి నిత్యం లక్ష మందికి పైగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రతిష్టాత్మక స్టేషన్‌లో కనీస వసతులు కూడా కరువయ్యాయి. ముఖ్యంగా ఉత్తరం వైపున ప్రత్యేకంగా ఉన్న రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఏమాత్రం సదుపాయాలు లేవు. తాగు నీరు అందుబాటులో లేక ప్రయాణికులు దాహంతో అలమటిస్తున్నారు. ఆ ప్రాంతంలలో మరుగుదొడ్డి అనేది కనిపించదు. మరోవైపు ఏటీఎంలు వరుసలగా ఉన్నప్పటికి ఒక్క దాంట్లో కూడా నగదు ఉండడం లేదు. కేవలం అలంకారంగానే ఏటీఎంలు మారుతున్నాయి. ఒక్క రోజులో రెండు గంటలు నగదు ఉంటే మరో పది రోజులు ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రిజర్వేషన్ టికెట్ తీసుకునే చోట క్యూర్ కోడ్ సౌకర్యం లేదు. దీంతో ప్రయాణికులు తప్పకుండా నగదు చెల్లించి టికెట్ తీసుకోవాల్సి వస్తోంది. అదే ప్రాంతంలో ఏటీఎంలు ఉన్నప్పటికి డబ్బులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. రైల్వేస్టేషన్‌కు 100 మీటర్ల దూరంలోనే తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ఉంది. అక్కడ వరుసగా ఏటీఎంలు ఉన్నాయి. అయితే అందులోని ప్రతి ఏటీఎంలో నిత్యం నగదు అందుబాటులో ఉంటుంది. రైల్వేస్టేషన్ వద్ద మాత్రం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ పలువురు మండిపడుతున్నారు,

ముగిసిన సదస్సులు.. పరిష్కరిస్తారా సమస్యలు !

- తిరుపతి వాసులకు రెవెన్యూ సదస్సులపై పూర్తి సమాచారం ఇవ్వని అధికారులు
- గత డిసెంబర్ 30 నాటికే ముగిసిన రెవెన్యూ సదస్సులు
- జిల్లాలో ఈ నెల 8 వరకు కొనసాగనున్న సభలు
- తిరుపతి నగరం మొత్తానికి ఏడు చోట్లేనా..!
- వచ్చిన అర్జీలు 336 ..అందులో 241 రెవెన్యూ సమస్యలపైనే..
- సదస్సులతో ప్రయోజనం ఎంతో ?


తిమ్మినాయుడుపాలెం రెవెన్యూ సదస్సులో శ్మశాన వివాదం (ఫైల్)

తిరుపతిలో రెవెన్యూ సదస్సులు	-	వచ్చిన అర్జీలు..
డిసెంబర్ 6- కష్టపి నిలయం	-	10
డిసెంబర్ 11- అక్కారంపల్లి	-	33
డిసెంబర్ 17-కొంకచెన్నయ్యగుంట	-	76
డిసెంబర్ 23-తిమ్మినాయుడుపాళెం	-	70
డిసెంబర్ 26-మంగళం	-	69
డిసెంబర్ 28-చెన్నాయగుంట	-	49
డిసెంబర్ 30-శెట్టిపల్లి	-	29
7 రోజుల సదస్సుల్లో వచ్చిన మొత్తం అర్జీలు	-	336

తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలో రెవెన్యూ సదస్సులు మూడు రోజుల క్రితం ముగిశాయి. అర్జీలపై రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత డిసెంబర్ 6 నుంచి ఈ నెల 8 వరకు జిల్లాలో రెవెన్యూ సదస్సులు కొనసాగనున్నాయి. అయితే తిరుపతి నగరంలో మాత్రం గత డిసెంబర్ 30వ తేదీ నాటికి ముగించారు. జిల్లా కేంద్రమైన తిరుపతి నగరంలో కార్పొరేషన్ లెక్క ప్రకారం 50 డివిజన్లు ఉన్నాయి. 5 లక్షల మంది జనాభా నివాసం ఉంటున్నారు. రెవెన్యూ డివిజన్లు 24 ఉన్నాయి. ప్రతి రెవెన్యూ డివిజన్‌లో రెవెన్యూ సదస్సు ఉంటుందని ముందుగా అంచనాలు వేశారు. అయితే తిరుపతిలో కేవలం 7 చోట్ల మాత్రమే సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల సమాచారం ముందుగా నగర వాసులకు పెద్దగా అందించలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో కేవలం 336 అర్జీలు మాత్రమే వచ్చాయి. అందులో 241 అర్జీలు రెవెన్యూ సమస్యలపై ఉన్నాయి. మిగిలిన 95 అర్జీలు మాత్రమే రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు, సర్టిఫికెట్లు తదితర సమస్యలపై వినతులు ఇచ్చారు.

ఎంత మేరకు ప్రయోజనం..

రెవెన్యూ సదస్సుల నిర్వహణ ద్వారా నగర వాసులకు ఎంతమేరకు ప్రయోజనం చేకూరిందని పలువురు లెక్కలు కడుతున్నారు. సదస్సులకు రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు, సబ్ రిజిస్ట్రార్ అధికారులు, దేవదాయశాఖ, కార్పొరేషన్ ఉద్యోగులతోపాటు పలు విభాగాలకు చెందిన అధికారులు హాజరు కావాల్సి ఉంది. అయితే రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు మాత్రమే పాల్గొన్నట్లు తెలుస్తోంది. ప్రారంభం రోజు సబ్ రిజిస్ట్రార్, ముగింపు రోజు మున్సిపల్ ఉద్యోగులు హాజరైనట్లు సమాచారం. మిగిలిన విభాగాలకు చెందిన అధికారులు ఎందుకు రాలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించిన నేపథ్యంలో అక్కడికక్కడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అంతా భావించారు. అయితే 75శాతం సమస్యలు రెవెన్యూకి చెందినవి కావడంతో వాటికి పరిష్కారం లభించలేదు. విద్యార్థులకు చెందిన సర్టిఫికెట్లు, స్థానికంగా ఉన్న పారిశుద్ధ్యం, వీధిలైట్లు తదితర చిన్నచిన్న సమస్యలకు మాత్రమే కాస్త ఊరట లభించినట్లు నగర వాసులు చెబుతున్నారు. మరి రెవెన్యూకి సంబంధించిన సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారో అని అర్జీదారులు ఎదురు చూస్తున్నారు.


మంగళంలో అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి(ఫైల్)


చెన్నాయగుంట వద్ద రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు(ఫైల్)

అవమానించడమే ఆర్‌ఎస్‌ఎస్ సంస్కృతి

తిరుపతి కల్చరల్: మహిళలను అవమానించడం, దురుసుగా ప్రవర్తించడం అనే ధోరణి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకు అలవాటుగా మారిపోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ప్రాంతంతో నిమిత్తం లేకుండా వారి అలవాటు విస్తృతం చేస్తున్నారని, దీన్ని మానకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు.